క్లుప్తంగా

'పది'కి పకడ్బందీగా ఏర్పాట్లు

హిందూపురం టౌన్: మండలంలో పది పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు ఎంఈఓ గంగప్ప ఆదివారం తెలిపారు. సోమవారం నుంచి పది పరీక్షలు ప్రారంభమవుతున్నాయని, మండల వ్యాప్తంగా 3,345 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారన్నారు. మొత్తం మండల వ్యాప్తంగా 13 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని, మొత్తం 160 ఇన్విజిలేటర్లు, చీఫ్ కస్టోడియల్, 13 మంది చీఫ్ ఇన్విజిలేటర్లు, మరో 13 మంది డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, 13 మంది క్లర్కులను నియమించినట్లు పేర్కొన్నారు.

ఘనంగా గరుడోత్సవం


గరుడ వాహనంపై నృసింహస్వామిని ఊరేగిస్తున్న దృశ్యం

రొళ్ల: మండల కేంద్రంలో వెలసిన లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి గరుడ వాహనంపై స్వామి వారు భక్తులకు దర్శనం ఇచ్చారు. ఊరేగింపులో స్వామివారికి పెద్ద ఎత్తున భక్తులు పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. సోమవారం రాత్రి పూల పల్లకీ ఉత్సవం నిర్వహిస్తున్నట్లు అర్చకులు తెలిపారు.

మద్యం దుకాణాలు, బార్లు తనిఖీ


మద్యం దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ సీఐ లక్ష్మీదుర్గయ్య

హిందూపురం టౌన్: మండలంలోని మద్యం దుకాణాలు, బార్లను ఎక్సైజ్ సీఐ లక్ష్మీదుర్గయ్య ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మద్యం నిల్వ రికార్డులను పరిశీలించారు. పరిగి మండలంలోని శ్రీరంగరాజుపల్లికి చెందిన పఠాన్ యూసఫ్‌ఖాన్ నుంచి 25 ప్యాకెట్ల కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. ఎస్‌ఐలు పృథ్వీరాజ్, ఫారూక్ తదితరులు పాల్గొన్నారు.

'పోరుబాట'ను విజయవంతం చేయండి


పోస్టర్ విడుదల చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

పెనుకొండ: పోరుబాట సదస్సులు విజయవంతం చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ డిమాండ్ చేశారు. పట్టణంలో ఆదివారం 'బడి కోసం.. బకాయిల కోసం' యూటీఎఫ్ పోరుబాట కార్యక్రమంలో స్థానికంగా ఉన్న ఓ హోటల్‌లో సమావేశం నిర్వహించారు. ఏపీ ఐక్యవేదిక ఫెడరేషన్ రాష్ట్ర వ్యాప్త పిలుపు మేరకు విద్యారంగ పరిరక్షణ, ఆర్థిక బకాయిలు కోసం రాష్ట్ర వ్యాప్తంగా చేపడుతున్న యూటీఎఫ్ పోరుబాట సదస్సులను 5 ప్రాంతాల్లో చేపడుతున్నామన్నారు. ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలన్నారు. అనంతరం పోరుబాట పోస్టర్‌ను విడుదల చేశారు. నాయకులు భూతన్న, బాబు, శ్రీనివాసులు, శివశంకర్, లక్ష్మీనారాయణ, నరేష్, అనిల్‌కుమార్, కిష్టప్ప, నరసింహప్ప తదితరులు పాల్గొన్నారు.

మైలార లింగేశ్వరస్వామికి దొనే సేవ



దొనే సేవలో పాల్గొన్న గొరవయ్యలు

అమరాపురం: మండల పరిధిలోని వలస గ్రామంలో వెలసిన మైలార లింగేశ్వరస్వామికి భక్తులు ఘనంగా దొనే సేవ నిర్వహించారు. స్వామి వారికి వివిధ రకాల అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి మహా మంగళ హారతి ఇచ్చారు. అనంతరం ఉత్సవ విగ్రహానికి ప్రత్యేకంగా పూజలు చేసి సాయంత్రం ఆలయ ఆవరణలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పళ్లెంలో అరటి పండ్లు, చక్కెర, పాలు పోసి నైవేద్యంగా ఏర్పాటు చేసి గొరవయ్యలు నృత్యం చేస్తూ భూతసేవ చేశారు. అనంతరం ప్రసాదంగా వాటిని భక్తులకు అందజేశారు.

సిమెంట్ తొట్టెలు పంపిణీ

లేపాక్షి: వేసవి తాపానికి పశుపక్షుల దాహార్తి తీర్చడానికి అనఘాదత్త ట్రస్ట్ ఆధ్వర్యంలో భక్తులకు ట్రస్ట్ చైర్మన్ విశ్వేశ్వరయ్య సోమవారం ఉదయం సిమెంట్ తొట్టెలను వితరణ చేశారు. వేసవిలో నీరు దొరకక పశువులు, పక్షులు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతోనే నీటి తొట్టెలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

విజయీభవ!




రొళ్ల: పదో తరగతి పరీక్షలు జరగనున్న గురుకుల పాఠశాల

మండలం	పరీక్ష కేంద్రాలు	విద్యార్థులు
మడకశిర	05	1,160
అమరాపురం	03	780
గుడిబండ	02	528
రొళ్ళ	02	410
అగళి	02	370
మొత్తం	14	3,248

- నేటి నుంచి ప్రారంభం కానున్న పది పరీక్షలు
- మడకశిర నియోజకవర్గంలో 14 కేంద్రాల ఏర్పాటు
- పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్, జిరాక్స్ కేంద్రాల మూసివేత
- పరీక్ష రాయనున్న 3,248 మంది విద్యార్థులు

మడకశిర: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు నేటి (సోమవారం) నుంచి ప్రారంభం కానున్నాయి. ఏప్రిల్ 1వ తేదీ వరకూ పరీక్షలు జరుగుతాయి. ఈ నేపథ్యంలో పరీక్షలను పకడ్బందీగా నిర్వహించడానికి విద్యాశాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఆయా మండలాల ఎంఈఓలు పరీక్షల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.

ఉదయం 9.30 గంటల నుంచి..

పదో తరగతి పరీక్షలు ఉదయం 9.30 గంటలకు ప్రారంభమవుతాయి. మధ్యాహ్నం 12.45 గంటల వరకూ జరుగుతాయి. అయితే విద్యార్థులు అరగంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని విద్యాశాఖ అధికారులు సూచించారు. ఉదయం 9 గంటలకే విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకుని పరీక్ష రాయడానికి అవసరమైనవన్నీ ఉన్నాయో లేదో సరి చూసుకోవాలని చెబుతున్నారు.

పరీక్ష కేంద్రాల్లో ప్రత్యేక ఏర్పాట్లు

నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులు ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రధానంగా చీకటి గదులు లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. పరీక్షలు రాయడానికి పూర్తిస్థాయిలో డెస్కులు ఏర్పాటు చేస్తున్నారు. తాగునీటి సౌకర్యంతో పాటు వైద్య సిబ్బందిని కూడా ముందు జాగ్రత్తగా ఉంచుతున్నారు. పరీక్షలు ముగిసే వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా చర్యలు తీసుకున్నట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు.

కేంద్రాల వద్ద 144 సెక్షన్

పదో తరగతి పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు పోలీసు అధికారులు తెలిపారు. పరీక్షలు అయ్యే వరకూ 144 సెక్షన్ పరీక్ష కేంద్రాల వద్ద కొనసాగుతుందన్నారు. అలాగే జిరాక్స్ కేంద్రాలను కూడా పరీక్షలు అయ్యే వరకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకూ మూసివేయనున్నట్లు పేర్కొన్నారు. జిరాక్స్ కేంద్రాలను తెరిస్తే యజమానులపై చర్యలు తప్పవని తెలిపారు.

విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- హాల్ టికెట్ తీసుకురావాలి
- పెన్నులు, పెన్సిల్, రబ్బర్, స్కేల్, అట్ట తీసుకురావాలి
- అరగంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి
- ఓఎంఆర్ షీట్ మీదో కాదో మొదట నిర్ధారించుకోవాలి
- ఓఎంఆర్ షీట్ నిర్ధారణ అయినప్పుడే పరీక్ష రాయడాన్ని మొదలుపెట్టాలి
- మొబైల్ ఫోన్లు తీసుకుని వెళ్లకూడదు
- ఇతర ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులను కూడా తీసుకెళ్లకూడదు
- ఎలాంటి కాగితాలు ఉంచుకోకుండా పరీక్ష కేంద్రాల్లోకి ప్రవేశించాలి

ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం



పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణానికి అవకాశం కల్పించాం. హాల్ టికెట్ చూపిస్తే చాలు ఆర్టీసీ బస్సులో ఉచితంగా ప్రయాణించ వచ్చు. పదో విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. నియోజకవర్గంలో పరీక్షలు రాయడానికి టెన్త్ విద్యార్థులు ఇబ్బందులు పడకుండా ఆర్టీసీ బస్సులను నడపడానికి చర్యలు తీసుకుంటున్నాం.

– రామసుబ్బయ్య, ఆర్టీసీ డీఎం, మడకశిర

పకడ్బందీగా బందోబస్తు



పదో పరీక్షలకు పకడ్బందీగా బందోబస్తు ఏర్పాటు చేస్తున్నాం. ప్రధానంగా పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నాం. పరీక్ష కేంద్రాల వద్ద వంద మీటర్ల వరకు ఎవరినీ కూడా రానియ్యం. ఎవరైనా సరే నిబంధనలను అతిక్రమించి పరీక్ష కేంద్రాల వద్దకు వస్తే చర్యలు తప్పవు. జిరాక్స్ సెంటర్లను కూడా పరీక్షలు అయ్యే వరకు తీయకుండా చర్యలు తీసుకుంటాం. ప్రశాంతంగా పరీక్షలు నిర్వహించడానికి అందరూ సహకరించాలి.

– రాజ్‌కుమార్, సీఐ, మడకశిర

ఒత్తిడికి గురికావొద్దు



పదో తరగతి విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా పరీక్షలు రాయడానికి చర్యలు తీసుకుంటున్నాం. విద్యార్థులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రధానంగా పరీక్ష కేంద్రాల వద్ద తాగునీరు, వైద్య సౌకర్యం కల్పిస్తున్నాం. గదుల్లో పూర్తిస్థాయిలో డెస్కులు ఏర్పాటు చేస్తున్నాం. చీకటి గదులు లేకుండా చూస్తున్నాం. విద్యార్థులు ఒత్తిడికి లోనుకాకుండా పరీక్షలు రాయాలి. మంచి ఫలితాలు సాధించి ఉన్నత చదువులకు వెళ్లాలి.

– భాస్కర్, ఎంఈఓ, మడకశిర



హిందుపురం	37.0
పెనుకొండ	39.0
మడకశిర	37.0

ఆదర్శ పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

అగళి: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో మొదటి సంవత్సరం ఇంటర్‌లో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ జాఫర్ ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 18 నుంచి మే 22వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గణితం, సైన్స్, కామర్స్‌కు సంబంధించిన గ్రూపుల అందుబాటులో ఉన్నాయన్నారు. పదో తరగతిలో పొందిన మార్కుల ఆధారంగా మెరిట్ జాబితా తయారు చేసి సీట్లను కేటాయిస్తామని పేర్కొన్నారు.

లైనింగ్ పనులు ఆపించండి

పెనుకొండ: 'హంద్రీ–నీవా ప్రాజెక్టు ప్రయోజనాలకు సమాధి కట్టేలా కాలువ లైనింగ్ పనులు చేయకూడదు. ఒక టీఎంసీ ప్రవాహ సామర్థ్యానికి కాలువ వెడల్పు చేయాలి' అని సీపీఐ, జలసాధన సమితి నాయకులు మంత్రి సవితకు ఒక వినతిపత్రం అందించారు. హంద్రీనీవా కాలువ మాల్యాల నుంచి 3,850 క్యూసెక్కుల సామర్థ్యం మేరకు కాలువ వెడల్పు చేయాలని, జీడిపల్లి రిజర్వాయర్ నుంచి కిందకు కాలువ వెడల్పు చేయకుండా లైనింగ్ చేయడానికి ప్రభుత్వం నిర్ణయించి పనులు ప్రారంభించిందని, దీనివల్ల రైతాంగం తీవ్రంగా నష్టపోతుందన్నారు. గత 5, 6 సంవత్సరాల నుంచి హంద్రీనీవా నీరు వస్తున్నప్పటికీ కేవలం కొన్ని చెరువులకు మాత్రమే నీరు ఇస్తున్నారని, ఉమ్మడి జిల్లాలో 2,500 చెరువులు ఉండగా 89 చెరువులకు మాత్రమే నీరు ఇచ్చారన్నారు. రాయలసీమ నాలుగు జిల్లాల్లో ఆరు లక్షల ఎకరాలకు, ఉమ్మడి అనంతపురం జిల్లాలో 3 లక్షలా 45 వేలు ఎకరాల ఆయకట్టుకు నీళ్లు ఇవ్వాలన్నదే హంద్రీనీవా ప్రాజెక్టు లక్ష్యమన్నారు. అది నెరవేరాలంటే లైనింగ్ పనులు రద్దు చేయాలన్నారు. ఇతర సమస్యలనూ నాయకులు మంత్రికి వివరించగా ఆమె సానుకూలంగా స్పందించారు. నాయకులు కాశీం, శ్రీరాములు, రాజశేఖరరెడ్డి తదితరులు మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.

మహిళా సంఘాల ఆదాయాభివృద్ధి భేష్


కరికెరలో పర్యటించిన కర్ణాటక మహిళా సంఘాల సభ్యులు

గుడిబండ: గ్రామాల్లో మహిళ సంఘం సభ్యుల పనితీరు, పొదుపు నమోదుతో పాటు బ్యాంక్ లింకేజీ రుణాలతో అభివృద్ధి చెందుతుండటం హర్షణీయమని కర్ణాటక రాష్ట్రం బళ్లారి జిల్లాకి చెందిన 80 మంది సంఘ సభ్యులు ప్రశంసించారు. ఆదివారం మండల పరిధిలోని కరికెర గ్రామంలోని పవిత్ర గ్రామైక్య సంఘం సభ్యులతో వారు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మహిళా సంఘాలు, రైతు సంఘాల నిర్వహణ, ఎఫ్‌పీఓ అందించిన సేవలు, మహిళా సంఘాల సభ్యులు చేపట్టిన ఆదాయ అభివృద్ధి కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో సందర్శించి సభ్యుల ద్వారా ఆదాయ మార్గాలపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, ఫోర్డ్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సుధాకర్, ఫోర్డ్ సంస్థ అధ్యక్షుడు బదరీష్, కోఆర్డినేటర్లు నాగరాజు, మహలింగప్ప, వెంకటేష్, ఏపీఎం తిప్పన్న, మండల సమైక్య అధ్యక్షులు కార్యదర్శి, సీసీ రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

నేడు వారపు సంత వేలం

లేపాక్షి: మండల కేంద్రమైన లేపాక్షి పంచాయతీ కార్యాలయంలో సోమవారం ఉదయం 11 గంటలకు లేపాక్షిలోని వారపుసంత, బస్టాండులో ఫీజులు వసూలుపై వేలం వేస్తున్నట్లు పంచాయితీ కార్యదర్శి రమేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వారపు సంతకు సంబంధించి వేలం పాడాల్సిన వేలం పాటదారులు రూ. 30 వేలు, బస్టాండులో ఫీజులు వసూలు చేయడం కోసం వేలం పాడాల్సిన వేలం పాటదారులు రూ. 2 లక్షలు ధరావస్తు చెల్లించాలని పేర్కొన్నారు.

సంక్షిప్త సమాచారం

పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన డీఎస్పీ

మడకశిరరూరల్: స్థానిక సర్కిల్ పోలీస్‌స్టేషన్‌ను ఆదివారం పెనుకొండ డీఎస్పీ వెంకటేశ్వర్లు సందర్శించారు. రెండు రోజుల క్రితం భూతప్ప కనుమ అటవీ ప్రాంతంలో గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైన విషయం విధితమే. దీంతో డీఎస్పీ వెంకటేశ్వర్లు, ట్రైనీ డీఎస్పీ ఉదయ పావని ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఇందుకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు.

భవన నిర్మాణానికి భూమి పూజ

పావగడ: తాలూకాలోని నాగలమడక గ్రామంలో గ్రామ పంచాయతీ నూతన భవన నిర్మాణానికి స్థానిక మాజీ మంత్రి వెంకటరమణప్ప ఆదివారం భూమి పూజ చేశారు. అదే విధంగా భవన నిర్మాణానికి ఉచితంగా స్థలం దానం చేసిన దాత తిమ్మమ్మనహళ్లి సుబ్బారెడ్డిని ఎమ్మెల్యే వెంకటేష్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ అంత్య సుబ్రహ్మణ్యస్వామి ఆలయ అభివృద్ధి పనులను త్వరలోనే చేపడతామన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

పెనుకొండ: పట్టణంలోని మంత్రి సవిత క్యాంప్ కార్యాలయంలో ఆదివారం బాధిత కుటుంబాలకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. ఆంజనేయులుకు 1,08,800, మరువపల్లి రమేష్‌కు రూ.55 వేలు, లోచర్ల శ్రీరాములుకు 2,70,189, నారనాగేపల్లి చిన్ననారాయణకు 1,26,800, ఎర్రగుంట్లకు చెందిన తేజకు 1,82, 668, జయలక్ష్మికి రూ. 39,162, గోవిందరెడ్డికి రూ.25 వేలు, కోనాపురం సువర్ణమ్మకు రూ. 51 వేలు, ఎర్రగుంట్ల కిష్టప్పకు రూ.75 వేలు, గుడిపల్లి శిల్పా రాజశేఖర్‌కు రూ.1.22 లక్షలు, కృష్ణమూర్తి యాదవ్‌కు రూ. 50 వేలు చెక్కులను మంత్రి సవిత అందజేశారు.

మూర్ఛ వ్యాధిగ్రస్తులకు చికిత్స

హిందూపురం టౌన్: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం అల్‌హిలాల్ పాఠశాల ఆవరణలో 128వ ఉచిత మూర్ఛ వ్యాధి వైద్య శిబిరానికి స్పందన లభించింది. డాక్టర్ ఈటీ రామ్మూర్తి నేతృత్వంలో వైద్యులు 141 మంది రోగులకు పరీక్షలను నిర్వహించి, మందులను పంపిణీ చేశారు..

గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కండి

మడకశిరరూరల్: గ్రామాభివృద్ధిలో ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు భాగస్వామ్యం కావాలని, అప్పుడే అభివృద్ధికి అవకాశం ఉంటుందని వక్తలు పేర్కొన్నారు. మండల పరిధిలోని వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ఆర్ అనంతపురం నిర్వహించిన ఎన్‌ఎస్‌ఎస్ క్యాంపు ఆదివారంతో ముగిసింది. కళాశాల అసోసియేట్ డీన్ సరోజినీదేవి మాట్లాడుతూ రైతులకు నూతన వ్యవసాయ విధానం, యాంత్రికరణపై అవగాహన కల్పించి ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా విద్యార్థులు కీలక పాత్ర పోషించాలన్నారు.

అలరించిన ఆర్కెస్ట్రా

పరిగి: మండలంలోని శ్రీరంగరాజుపల్లిలో మూడు రోజులుగా జరుగుతున్న తాతయ్యస్వామి ఉరుసు ఉత్సవాలు ఆదివారం రాత్రి ముగిశాయి. చివరి రోజు ఆదివారం రాత్రి తాతయ్యస్వామి దర్గా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఆర్కెస్ట్రా అందరినీ అలరించింది. సినీ గేయాలు, భక్తి పాటలతో గాయకులు యువతను ఉర్రూతలూగించారు. ఎస్‌ఐ రంగడుయాదవ్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు

హిందూపురం: మండలంలోని ఎక్కడా తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని ఆర్ డబ్ల్యుఎస్ ఏఈ వేణుగోపాల్ తెలిపారు. తూమకుంట పంచాయతీ సర్పంచ్ రత్నమ్మ, ఎంపీడీఓ శివకుమార్ ఆదేశాలతో మండలంలోని తూమకుంట పంచాయతీలో హౌసింగ్ కాలనీలో రూ.2 లక్షలతో కొత్త పంప్ సెట్, త్రీఫేస్ మోటర్ ఏర్పాటు చేసినట్లు కార్యదర్శి కెంచెరాయప్ప చెప్పారు.

పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి






పెనుకొండ: పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి సవిత, ఆమిదాలగొంది వృద్ధాశ్రమంలో... , అగళి: బీసీ బాలురు వసతి గృహంలో ..

పెనుకొండ: అమరజీవి పొట్టిశ్రీరాములు జయంతిని పట్టణంలో ఘనంగా నిర్వహించారు. మంత్రి సవిత తన క్యాంప్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అదేవిధంగా ఆర్య వైశ్య సంఘం నాయకులు పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి ఆయన్ను స్మరించారు. పొట్టిశ్రీరాములు త్యాగాన్ని కొనియాడారు.

మడకశిరరూరల్: మండల పరిధిలోని ఆమిదాలగొంది గ్రామంలోని వెంకటేశ్వర వృద్ధాశ్రమంలో ఆదివారం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వృద్ధులకు పండ్లు, బ్రెడ్డు పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ తనయుడు జయరాజ్, మున్సిపాలిటీ వైస్ చైర్మన్ రామచంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు కృష్ణమూర్తి, సైపుల్లా, కౌన్సిలర్లు నాయకులు అన్సార్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అగళి: మండల పరిధిలోని మధూడి, అగళి బీసీ వసతి గృహాల్లో ఆదివారం పొట్టి శ్రీరాములు జయంతిని జరుపుకున్నారు. ఆయన చిత్రపటం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. బీసీ వసతి గృహం వార్డెన్ సికిందర్... పొట్టి శ్రీరాములు ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం చేసిన త్యాగాన్ని విద్యార్థులకు వివరించారు.

వైభవంగా తిప్పేరుద్రస్వామి రథోత్సవం


తిప్పేరుద్రస్వామి రథోత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం


అగ్ని గుండంలోకి ధూపం వేస్తున్న భక్తులు


అమరాపురం: మండల సరిహద్దులోని వదనకల్లులో వెలసిన తిప్పేరుద్రస్వామి రథోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి రాత్రి వరకూ స్వామి వారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఆలయం ముందు ఉన్న అగ్నిగుండంలోకి ధూపం, కొబ్బరి, వేరుశనగ తదితర వాటిని వేసి భక్తులు మొక్కులు చెల్లించారు. అనంతరం భక్తిశ్రద్ధలతో స్వామిని రథంపై కొలువుతీర్చి రథోత్సవం నిర్వహించారు.

హిందీ మాధ్యమాన్ని ప్రారంభించండి

హిందూపురం టౌన్: హిందూపురం రూరల్ మండలం తూమకుంటలో హిందీ మాధ్యమ ప్రత్యేక పాఠశాలను ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలని మంత్రి సవితను తూమకుంట ప్రాంతానికి చెందిన ఉపాధ్యాయుడు బాలగంగాధర్ నాయక్ కోరారు. ఆదివారం పెనుకొండలో మంత్రి నివాసంలో కలిసి వినతిపత్రం అందించారు. బాలగంగాధర్‌నాయక్ మాట్లాడుతూ హిందూపురం పారిశ్రామికవాడలో వేలాదిమంది వలస కార్మికులు పనిచేస్తున్నారన్నారు. వారి బిడ్డల ఇబ్బందిని దృష్టిలో ఉంచుకొని హిందీ మాధ్యమ పాఠశాలను ప్రారంభించాలని కోరారు.

అమ్మా .. నాన్న ఎప్పుడొస్తాడు?


దివ్యాంగుడైన కుమారుడికి అన్నం తినిపిస్తున్న తల్లి మంజుల


వృద్ధ అత్తమామలు, చిన్నారులతో మంజుల

పావగడ: తాలూకాలోని నెనగానహళ్లికి చెందిన సర్వే విభాగం కాంట్రాక్టు ఉద్యోగి మంజునాథ్ మృతి ఆ కుటుంబాన్ని రోడ్డున పడేసింది. ఇటీవల గుండెపోటుతో మంజునాథ్ మృతి చెందిన విషయం పాఠకులకు విధితమే. ఆ కుటుంబానికి ఎలాంటి ఆస్తిపాస్తులు లేకపోగా మృతుడి భార్య మంజుల తన ముగ్గురు కుమార్తెలు, 13 ఏళ్ల దివ్యాంగ కుమారుడిని పోషించుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతోంది. గతంలో మంజునాథ్‌కు వచ్చే రూ.10 వేల జీతంతో ఎలాగోలా సంసారం నెట్టుకొచ్చేవారు. అయితే మంజునాథ్ మృతితో ఎలాంటి ఆదాయం లేకపోగా దివ్యాంగ కుమారుడిని ఇంట్లో వదిలి కూలికి పోలేక మంజుల అవస్థలు పడుతోంది. ఇదిలా ఉంటే అన్యం పుణ్యం ఎరుగని ఆ పిల్లలు ఇంకా తమ నాన్న ఇంటికి వస్తాడనే భావనలోనే ఉన్నారు. నాన్న ఇంటికి ఎప్పుడు వస్తాడమ్మా అంటూ ఆ తల్లిని అడుగుతుండటంతో ఏం చెప్పాలో కూడా ఆమెకు అర్థం కావడం లేదు. ఆ అమ్మ కన్నీరు అందరినీ కంటతడి పెట్టింది. దీనస్థితిలో ఉన్న కోడలిని ఆదుకునే పరిస్థితుల్లో కూడా లేకపోయామే అంటూ వృద్ధులైన అత్తమామ కూడా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఆ కుటుంబాన్ని ఆదుకునేందుకు దాతలు ఎవరైనా ముందుకు రావాలని గ్రామస్తులు కోరుతున్నారు.